క్లుప్తంగా

నేడు సీతారాముల కల్యాణం

పొదలకూరు: పట్టణంలోని రామమందిరం వద్ద శనివారం రాత్రి 7 గంటలకు సీతారాముల కల్యాణం వైభవంగా జరుగుతుందని ఉభయకర్తలు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. భక్తులకు అన్నప్రసాదాలను ఏర్పాటు చేస్తున్నట్లు వెల్లడించారు. ఉభయకర్తలుగా కోనం చినబ్రహ్మయ్య – హైమావతి, వూకోటి వెంకటేశ్వర్లు – పద్మావతి, వూకోటి లక్ష్మీనారాయణ – కళాభారతి వ్యవహరిస్తున్నట్లు వెల్లడించారు.

రైతులకు న్యాయం జరిగేలా చూస్తా

వెంకటాచలం: అకాల వర్షం కారణంగా ధాన్యం తడిచిపోయి నష్టపోయిన రైతులకు న్యాయం జరిగేలా చూస్తానని సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి తెలిపారు. మండలంలోని తాటిపర్తిపాళెం, ఇస్కపాళెం, ఈదగాలి, పూడిపర్తి తదితర గ్రామాల్లో శుక్రవారం ఎమ్మెల్యే పర్యటించి రైతులతో మాట్లాడారు. వర్షం కారణంగా నియోజకవర్గంలో ధాన్యం తడిచిపోయి రైతులకు నష్టం జరిగిందని, ఈ విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానన్నారు. ఆయన వెంట అధికారులు, నాయకులున్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

తోటపల్లిగూడూరు: మండలంలోని సాలిపేట సబ్‌స్టేషన్‌లో లైన్ల మరమ్మతుల నేపథ్యంలో శనివారం పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని తోటపల్లిగూడూరు సబ్‌స్టేషన్ ఏఈ సుకుమార్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. వరకవిపూడి, అనంతపురం, ఈదూరు, సాలిపేట, మల్లికార్జునపురం గ్రామాల్లో ఉదయం 8.30 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకూ సాధారణ, ఆక్వా సర్వీసులకు సరఫరా నిలిపేస్తామన్నారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

• **పొదలకూరు:** పట్టణంలోని సబ్‌స్టేషన్ పరిధిలో శనివారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 1.30 వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని ఏఈ శ్రీకాంత్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. సబ్‌స్టేషన్లో మరమ్మతుల కారణంగా సరఫరా ఉండదని, వినియోగదారులు సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

వైద్య విద్యార్థుల ర్యాలీ



బుచ్చిరెడ్డిపాళెం రూరల్: మండలంలోని పెనుబల్లిలో ప్రభుత్వ మెడికల్ కళాశాల వైద్య విద్యార్థులు ర్యాలీని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ ఖాదర్‌వలీ మాట్లాడారు. కుటుంబ ఆరోగ్య దత్తత కార్యక్రమంలో భాగంగా గ్రామంలో ప్రతి ఇంటికీ విద్యార్థులు వెళ్లి సర్వే చేయనున్నారని చెప్పారు. హెచ్‌ఓడీ గోవింద్ తదితరులు పాల్గొన్నారు.

పరిశుభ్రతపై అవగాహన



ఇందుకూరుపేట: పోషణ్ పక్వాడా పక్షోత్సవాలను పురస్కరించుకొని ఇందుకూరుపేట ఐసీడీఎస్ ప్రాజెక్ట్ పరిధిలోని కొరుటూరు ఎస్సీ, జగదేవిపేట అంగన్‌వాడీ కేంద్రాల్లో పరిశుభ్రతపై అవగాహన కార్యక్రమాలను శుక్రవారం నిర్వహించారు. శిశువుల్లో ఇన్‌ఫెక్షన్లను నివారించడం తదితరాలపై అవగాహన కల్పించారు. హ్యాండ్ వాష్ కార్యక్రమంపై డెమో ఇచ్చారు. సీడీపీఓ రాజ్యలక్ష్మి, సూపర్‌వైజర్లు సుబ్బరత్నం, మంజుల తదితరులు పాల్గొన్నారు.

బెల్టుషాపులపై దాడులు

కోవూరు: మండలంలోని పాటూరులో బెల్టుషాపులను నిర్వహిస్తున్నారనే సమాచారంతో కోవూరు ప్రొహిబిషన్, ఎక్సైజ్ సీఐ కిశోర్ దాడులను గురువారం రాత్రి నిర్వహించారు. ఈ సందర్భంగా ఎనిమిది సీసాలను స్వాధీనం చేసుకున్నారు. గతేడాది అక్టోబర్ నుంచి ఇప్పటి వరకు 61 కేసులను నమోదు చేశామని వివరించారు. మండలాల్లో గంజాయి, నాటుసారా, అనధికారిక మద్యం విక్రయాలు జరుగుతున్నాయని తెలిస్తే 94409 02524 నంబర్‌కు సమాచారమివ్వాలని కోరారు.

చలివేంద్రం ప్రారంభం



బుచ్చిరెడ్డిపాళెం రూరల్: పట్టణంలోని వెలుగు కార్యాలయం వద్ద చలివేంద్రాన్ని ఏపీఎం శ్రీధర్ ఆధ్వర్యంలో శుక్రవారం ఏర్పాటు చేశారు. అనంతరం వీఓఏలతో సమావేశాన్ని నిర్వహించారు. వెలుగు ప్రాజెక్ట్ డైరెక్టర్ నాగరాజకుమారి, మండల వ్యవసాయాధికారి సురేంద్ర తదితరులు పాల్గొన్నారు.

పేదలపై కూటమి ‘బండ’

గ్యాస్ సిలిండర్లు



- గ్యాస్ సిలిండర్ ధర పెంపు
- ఇప్పటికే ఒక్కోదానిపై రూ.840 వసూలు
- మరో రూ.50 పెంచిన కేంద్రం
- ఆవేదన వ్యక్తం చేస్తున్న వినియోగదారులు

వెంకటాచలం: ఎన్నికల సమయంలో కూటమి పెద్దలు అనేక హామీలిచ్చారు. తీరా అధికారంలోకి వచ్చాక ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. వారి కారణంగా పేదలపై వంట గ్యాస్ సిలిండర్ల ధర పెనుభారంగా మారిపోతోంది. ఇప్పటికే వినియోగదారులు ఒక్కో సిలిండర్‌ను రూ.840 వెచ్చించి కొనుగోలు చేయలేక నానా అవస్థలు పడుతున్నారు. తాజాగా రూ.50 పెంచుతూ ప్రభుత్వం నిర్ణయం తీసుకోవడంతో వినియోగదారులు, ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

అన్నీ పెంచేసి..

మండలంలోని 25 గ్రామ పంచాయతీల్లో 20 వేల నివాసాలుండగా, 60 వేలకుపైగా జనాభా ఉన్నారు. గ్రామాల్లో గతంలో కట్టెల పొయ్యి ఆధారంగా పేదలు ఎక్కువ శాతం వంట చేసుకునే వారు. కొన్నేళ్ల నుంచి గ్యాస్ సిలిండర్ల వినియోగం పెరిగింది. ప్రతి ఇంట్లోనూ సిలిండర్లు ద్వారానే మహిళలు వంట చేస్తున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక కూరగాయలు, పప్పులు, నూనె ధరల పెరుగుదలతో సామాన్యుడి జీవనంపై ప్రభావం పడింది. తాజాగా గ్యాస్ సిలిండర్‌పై మరో రూ.50 అదనంగా పెంచడంతో వినియోగదారులు ప్రభుత్వ తీరుపై మండిపడుతున్నారు. ప్రస్తుతం ఒక్కో సిలిండర్ ధర రూ.840 ఉండగా, పెంచిన ధరతో కలిపి రూ.890 చెల్లించాల్సి వస్తుందని మహిళలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



వెంకటాచలంలోని గ్యాస్ ఏజెన్సీ గోదాము

అధిక వసూళ్లపై చర్యలేవీ?

మండలంలో గ్యాస్ ఏజెన్సీల సిబ్బంది వినియోగదారుల వద్ద అధిక మొత్తం వసూలు చేస్తున్నారని ఆరోపణలున్నాయి. అన్ని గ్రామాల్లో ఆటోల ద్వారా గ్యాస్ సిలిండర్లు వినియోగదారులకు సరఫరా చేస్తున్నారు. అయితే రవాణా పేరుతో ఒక్కో సిలిండర్‌పై రూ.60 నుంచి రూ.90 వరకు అధికంగా వసూలు చేస్తున్నట్లు చెబుతున్నారు. నిబంధనల ప్రకారం రవాణా పేరుతో వినియోగదారుల నుంచి నగదు తీసుకోకూడదు. కానీ కొందరు సిబ్బంది డిమాండ్ చేసి మరీ వసూళ్లకు పాల్పడుతున్నారు. దీనిపై పలుమార్లు అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని మహిళలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

వంట గ్యాస్ ధర పెంచడం అన్యాయం



గ్యాస్ సిలిండర్ ధరను పెంచడం అన్యాయం. ఇప్పటికే రూ.840 చెల్లిస్తున్నాం. అదనంగా మరో రూ.50 పెంచి భారం మోపడం సరికాదు. ప్రభుత్వం పునరాలోచన చేసి ధరలను వెంటనే తగ్గించాలి.

– నాగమణి, సర్వేపల్లి

భారం మోపడమే..



ఇప్పటికే నిత్యావసర సరుకులు, కూరగాయల ధరల పెరుగుదలతో అల్లాడిపోతున్నాం. తాజాగా వంట గ్యాస్ ధరను కూడా పెంచడం పేదలపై భారం మోపడమే. ప్రస్తుతం ఉన్న ధరలను వెంటనే తగ్గించాలి. గ్యాస్ ధరలు పెంచుకుంటూ పోతే రాబోయే రోజుల్లో పేదలు మరింత ఇబ్బంది పడతారు.

– కె.వెంకమ్మ, సర్వేపల్లి

వైభవంగా పార్వేట ఉత్సవం



పొదలకూరు: మండలంలోని చెన్నారెడ్డిపల్లి గ్రామం శ్రీరామాలయంలో నవమి వేడుకలు వైభవంగా జరుగుతున్నాయి. గురువారం రాత్రి స్వామి, అమ్మవార్ల పార్వేట ఉత్సవాన్ని నిర్వహించారు. ఉభయకర్తలుగా తూర్పువీధి వారు వ్యవహరించారు. మధ్యాహ్నం రథోత్సవం, సీతారాములకు ప్రత్యేక పూజలను నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

డిగ్రీ పరీక్షల్లో ఇద్దరు విద్యార్థుల డిబార్

వెంకటాచలం: విక్రమ సింహపురి యూనివర్సిటీ (వీఎస్‌యూ) పరిధిలోని అనుబంధ కళాశాలల్లో శుక్రవారం నిర్వహించిన డిగ్రీ రెండో సెమిస్టర్ పరీక్షల్లో ఇద్దరు విద్యార్థులు డిబార్ అయ్యారని ఎగ్జామ్స్ నిర్వహణాధికారి డాక్టర్ ఆర్.మధుమతి తెలిపారు. 9,450 మందికి గానూ 8,873 మంది హాజరుకాగా.. 577 మంది గైర్హాజరయ్యారని వెల్లడించారు. నాయుడుపేటలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఇద్దరు విద్యార్థులను డిబార్ చేశారన్నారు.

సామాజిక న్యాయానికి పూలే పోరాటం

కొడవలూరు: సామాజిక న్యాయం కోసం జ్యోతిరావు పూలే చివరి వరకు పోరాడారని తహసీల్దార్ స్ఫూర్తి రెడ్డి పేర్కొన్నారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి శుక్రవారం నివాళులర్పించారు. డీటీ సారంగపాణి, సీనియర్ సహాయకుడు మస్తాన్‌బాబు, వీఆర్వోలు ఏడుకొండలు, దాసు, శ్రీనివాసులు, సుబ్బయ్య, సురేష్, జూనియర్ అసిస్టెంట్ అశ్విన్, మస్తాన్ పాల్గొన్నారు.

• **పొదలకూరు:** జ్యోతిరావు పూలే జయంతిని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. పూలే భవన్ వద్ద ఆయన విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు వూకోటి లక్ష్మీనారాయణ మాట్లాడారు. కార్యక్రమంలో బీసీ నాయకులు తుమ్మల శ్రీనివాసులు, కోవూరు వెంకటేశ్వర్లు, పముజుల శంకరయ్య, రాధయ్య, కండే నర్సయ్య, బి.మురళి, మోహన్, కె.చలపతి, సుధాకర్, పిచ్చయ్య తదితరులు పాల్గొన్నారు.

• పట్టణంలోని నాగార్జున స్కూల్లో శుక్రవారం జ్యోతిరావు పూలే జయంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా కరస్పాండెంట్ బి.సునీతారెడ్డి, ప్రిన్సిపల్ లక్ష్మీదుర్గా పూలే సేవలను కొనియాడారు. కార్యక్రమంలో సుబ్బారావు, చంద్రశేఖర్, పాపయ్య, కృష్ణ, జీఎస్ రెడ్డి జీవీఆర్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



పొదలకూరులో..



వెంకటాచలం: నివాళులర్పించిన ఇన్‌చార్జి రిజిస్ట్రార్ తదితరులు

• **ముత్తుకూరు:** మండలంలోని ముత్తుకూరు రెవెన్యూ కార్యాలయంలో శుక్రవారం పూలే జయంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ స్వప్న మాట్లాడుతూ బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతి కోసం పూలే అహర్నిశలూ శ్రమించారన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ ప్రదీప్, పలువురు వీఆర్వోలు, రెవెన్యూ ఉద్యోగులు పాల్గొన్నారు.

• **వెంకటాచలం:** మండలంలోని కాకుటూరు వద్ద నున్న విక్రమ సింహపురి యూనివర్సిటీ (వీఎస్‌యూ)లో శుక్రవారం జ్యోతిరావు పూలే జయంతిని ఘనంగా నిర్వహించారు. పూలే చిత్రపటానికి ఇన్‌చార్జి రిజిస్ట్రార్ డాక్టర్ కె.సునీత పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మహిళా విద్య, సామాజిక సమానత్వం కోసం పూలే చేసిన కృషి చిరస్మరణీయమని కొనియాడారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ విజయానంద్‌కుమార్ బాబు, డాక్టర్ ఆర్.మధుమతి, ఆర్.ప్రభాకర్, ఎన్ఎస్ఎస్ కో–ఆర్డినేటర్ డాక్టర్ ఉదయ్‌శంకర్ తదితరులు పాల్గొన్నారు.

• **బుచ్చిరెడ్డిపాళెం రూరల్:** బడుగు, బలహీన వర్గాల హక్కుల కోసం పోరాడిన గొప్ప వ్యక్తి జ్యోతిరావు పూలే అని పలువురు కొనియాడారు. పట్టణంలోని అంబేడ్కర్ భవన్‌లో పూలే చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. నేతలు వెంకటరమణయ్య, మధుసూదన్‌రావు, బట్టా విల్సన్ తదితరులు పాల్గొన్నారు.



పొదలకూరులో..



బుచ్చిరెడ్డిపాళెం రూరల్: అంబేడ్కర్ భవన్‌లో..



కొడవలూరు: తహసీల్దార్ కార్యాలయంలో..



ముత్తుకూరు: పూలే చిత్రపటానికి నివాళులర్పిస్తున్న రెవెన్యూ ఉద్యోగులు

పౌష్టికాహారంతోనే రక్తహీనతకు చెక్



మనుబోలు: మాట్లాడుతున్న సీడీపీఓ విజయలక్ష్మి



టీపీగూడూరు: చేతుల పరిశుభ్రతపై అవగాహన కల్పిస్తూ..

మనుబోలు: పోషక విలువలున్న ఆహారం తీసుకోవడం ద్వారా బాలింతలు, గర్భిణుల్లో వచ్చే రక్తహీనతను నివారించవచ్చని ఐసీడీఎస్ సీడీపీఓ విజయలక్ష్మి అన్నారు. పౌష్టికాహార పక్షోత్సవాల్లో భాగంగా మండల పరిధిలోని సంగమేశ్వర కాలనీ, వెంకన్నపాళెం అంగన్‌వాడీ కేంద్రాల్లో శుక్రవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కోడిగుడ్లు, పాలు, ఆకుకూరలు, తాజా కూరగాయలు, పండ్లు రోజువారి ఆహారంలో తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్లు రమణమ్మ, పద్మజ, అంగన్‌వాడీలు సుజన, నిర్మల, శ్రీలక్ష్మి, మునెమ్మ తదితరులు పాల్గొన్నారు.

• **తోటపల్లిగూడూరు:** పౌష్టికాహార పక్షోత్సవాల్లో భాగంగా శుక్రవారం వరిగొండ ఎస్టీ కాలనీ అంగన్‌వాడీ కేంద్రంలో చేతుల పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. ఐసీడీఎస్ తోటపల్లిగూడూరు సూపర్‌వైజర్ రంగమ్మ మాట్లాడారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు పుష్ప, సునీత, వత్సలమ్మ, శ్రీదేవి, భవాని, భార్గవి, షాన్‌వాజ్ తదితరులు పాల్గొన్నారు.

బీపీసీఎల్ పైపులైన్ ఏర్పాటును ఆపండి

ముత్తుకూరు: భారత్ పెట్రోలియం కంపెనీ లిమిటెడ్ (బీపీసీఎల్) సంస్థ తమ గ్రామాల మధ్య ఏర్పాటు చేస్తున్న పైప్ నిర్మాణాన్ని ఎట్టి పరిస్థితిలోను అంగీకరించేదిలేదని మత్స్యకార గ్రామాల పెద్దలు స్పష్టం చేశారు. పైపులైను ఏర్పాటుపై శుక్రవారం కృష్ణపట్నం పంచాయతీలోని ఆర్కాట్‌పాళెం, రామ్‌నగర్ వద్ద అభిప్రాయ సేకరణ చేపట్టారు. రెండు గ్రామాల మధ్య పైపులైన్ ఏర్పాటుకు అవసరమైన భూములున్నాయని తహసీల్దార్ స్వప్న తదితరులు ప్రతిపాదించగా గ్రామ పెద్దలు ససేమిరా అన్నారు. పైపులైన్ ఏర్పాటుకు తాము వ్యతిరేకం కాదని, అయితే గ్రామానికి దూరంగా రొంటమల్లయ్య కాలువ వద్ద ఉన్న ప్రభుత్వ భూముల్లో ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. బీపీసీఎల్ సంస్థ సైట్ ఇంజినీర్ ప్రమోద్, పలువురు గ్రామ పెద్దలు పాల్గొన్నారు.



రెవెన్యూ అధికారులకు అర్జీ ఇస్తున్న మత్స్యకార గ్రామాల పెద్దలు

మర్యాదపూర్వకంగా..







బుచ్చిరెడ్డిపాళెం రూరల్: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ బుచ్చిరెడ్డిపాళెం రూరల్ నూతన కమిటీల్లో నియమితులైన వారు మాజీ మంత్రి ప్రసన్నకుమార్‌రెడ్డిని నెల్లూరులోని ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా శుక్రవారం కలిశారు. ఈ సందర్భంగా కృతజ్ఞతలను తెలియజేశారు. డీసీఎమ్మెస్ మాజీ చైర్మన్ వీరి చలపతిరావు, బుచ్చిరెడ్డిపాళెం రూరల్, పట్టణ కన్వీనర్లు చెర్లో సతీష్‌రెడ్డి, షాహుల్, మధుసూదన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

• **విడవలూరు:** వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ మండల కమిటీ సభ్యులుగా నియమితులైన పలువురు మాజీ మంత్రి, పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డిని నెల్లూరులోని ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మొక్కను అందజేశారు. పార్టీ రైతు విభాగ జిల్లా అధ్యక్షుడు పూండ్ల అచ్యుత్‌రెడ్డి, మండల కన్వీనర్ కాటంరెడ్డి నవీన్‌రెడ్డి, రాష్ట్ర చేనేత విభాగ అధ్యక్షుడు చేబ్రోలు జనార్దన్, వైస్ ప్రెసిడెంట్ బెల్లంకొండ శ్రీధర్, గండవరపు వివేక్‌రెడ్డి, జనరల్ సెక్రటరీ మాధవయ్య, వెంకటేశ్వర్లు, సుధీర్, సెక్రటరీ చంద్రయ్య, అంకబాబు, మల్లికార్జున తదితరులు పాల్గొన్నారు.

• **ఇందుకూరుపేట:** మాజీ మంత్రి నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డిని మైపాడు సర్పంచ్ సంగం వెంకయ్య, ఎంపీటీసీ రమణయ్య, మాజీ ఎంపీటీసీ శ్రీహరికోట ప్రసాద్, మహేష్, విజయ తదితరులు నెల్లూరులోని ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. జొన్నవాడ దేవస్థాన చైర్మన్, పార్టీ ఇందుకూరుపేట మండలాధ్యక్షుడు మావులూరు శ్రీనివాసులురెడ్డి, డీఎల్డీఏ చైర్మన్ గొల్లపల్లి విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

భూముల రీసర్వేకు సహకరించండి

ముత్తుకూరు: ఏపీ రీసర్వే ప్రాజెక్ట్‌లో భాగంగా త్వరలో కృష్ణపట్నం రెవెన్యూ గ్రామంలో జరిగే భూముల రీసర్వేకు ప్రతిఒక్కరూ సహకరించాలని తహసీల్దార్ స్వప్న విజ్ఞప్తి చేశారు. శుక్రవారం కృష్ణపట్నంలో అవగాహన ర్యాలీని ఆమె ప్రారంభించి ప్రసంగించారు. రెవెన్యూ గ్రామంలో ఏర్పడిన భూ సమస్యలను సర్వే ద్వారా పరిష్కరించుకోవచ్చన్నారు. కార్యక్రమంలో రీ సర్వే డిప్యూటీ తహసీల్దార్ శ్రీనివాసులు, డిప్యూటీ సర్వేయర్ అనురూప్, నాయకులు ఈదూరు రామమోహన్‌రెడ్డి, బొనిగి ఆనందయ్య, గ్రామపెద్దలు పాల్గొన్నారు.



అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న అధికారులు తదితరులు

వాటర్ ప్లాంట్‌లో పరిశీలన

కొడవలూరు: నార్తురాజుపాళెంలో పంచాయతీ ఆధ్వర్యంలోని మినరల్ వాటర్ ప్లాంట్ వినియోగంలో ఉందని, దీన్ని సద్వినియోగం చేసుకోవాలని పంచాయతీ కార్యదర్శి శ్యామ్‌సుందర్ కోరారు. నార్తురాజుపాళెంలోని వాటర్ ప్లాంట్‌ను శుక్రవారం పరిశీలించిన అనంతరం ఆయన మాట్లాడారు. ఈ ప్లాంట్ కొంతకాలంగా నిరుపయోగంగా ఉందని, ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి ప్రత్యేక చొరవ చూపి నిధులను మంజూరు చేయడంతో వినియోగంలోకి వచ్చిందని వివరించారు.



ఒకేషనల్ కోర్సులతో నైపుణ్యాభివృద్ధి

మనుబోలు: ఒకేషనల్ కోర్సుల ద్వారా విద్యార్థుల్లో నైపుణ్యాభివృద్ధి పెంపొందుతుందని కో–ఆర్డినేటర్ ఫ్రాన్సిస్ అన్నారు. బ్యూటీషియన్, వెల్నెస్ ఒకేషనల్ కోర్స్ ఇంటర్న్‌షిప్‌లో భాగంగా మనుబోలు తూర్పువీధిలోని సింధు బ్యూటీపార్లర్‌లో శిక్షణ పొందుతున్న విద్యార్థులను శుక్రవారం కలిసి వివిధ అంశాలను తెలుసుకున్నారు. భవిష్యత్‌లో విద్యార్థినులు స్వయం ఉపాధి పొందేందుకు ఇలాంటి కోర్సులు ఉపయోగపడతాయన్నారు. నిర్వాహకురాలు శైలజతో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. ఒకేషనల్ కోర్స్ ఇన్‌స్ట్రక్టర్ కృష్ణవేణి పాల్గొన్నారు.



ఇంటర్న్‌షిప్ చేస్తున్న విద్యార్థులతో కో–ఆర్డినేటర్

కృష్ణపట్నంలో గ్రామోత్సవం

ముత్తుకూరు: శ్రీరామనవమి ఉత్సవాల్లో భాగంగా కృష్ణపట్నంలోని శ్రీకోదండరామ స్వామి ఆలయంలో శుక్రవారం రాత్రి సీతారాముల గ్రామోత్సవం జరిగింది. విద్యుద్దీపాలతో ప్రత్యేకంగా అలంకరించిన వాహనంపై సీతారాముల విగ్రహాలను ఉంచి ప్రతి వీధిలో ఊరేగించారు.

జనసేన పార్టీ కార్యాలయం ప్రారంభం

పొదలకూరు: పట్టణంలోని ఆర్టీసీ ఎదురుగా జనసేన పార్టీ కార్యాలయాన్ని శుక్రవారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకుడు నూనె మల్లికార్జున్ యాదవ్, బి.సురేష్‌నాయుడు, మండల ఇన్‌చార్జి అనిల్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

బైక్ ఢీకొని వృద్ధుడికి గాయాలు

మనుబోలు: మనుబోలు బైపాస్‌లోని యాచవరం క్రాస్ వద్ద శుక్రవారం వృద్ధుడు రోడ్డు దాటుతుండగా మోటార్‌బైక్ ఢీకొని తీవ్రంగా గాయపడ్డాడు. పోలీసుల కథనం మేరకు.. గూడూరు మండలం పుట్టంరాజు కండ్రిగకు చెందిన తుమ్మూరు వెంకటరమణయ్య పని నిమిత్తం మనుబోలుకు వచ్చాడు. యాచవరం క్రాస్‌రోడ్డు వద్ద హైవే దాటుతుండగా గూడూరు నుంచి నెల్లూరు వైపు వెళ్తున్న మోటార్‌బైక్ వేగంగా ఢీకొట్టింది. దీంతో వెంకటరమణయ్య గాయపడ్డాడు. చికిత్స నిమిత్తం అతడ్ని గూడూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేశారు.

ఏఎంసీ కమిటీకి అభినందన

వెంకటాచలం: సర్వేపల్లి నియోజకవర్గ కేంద్రమైన వెంకటాచలంలో శుక్రవారం సాయంత్రం అగ్రికల్చర్ మార్కెట్ కమిటీ (ఏఎంసీ)కి అభినందన సభ నిర్వహించారు. చైర్మన్‌గా నియమితులైన గాలి రామకృష్ణారెడ్డి, వైస్ చైర్మన్‌గా నియమితులైన అరుణమ్మ, డైరెక్టర్లను సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, నుడా చైర్మన్ కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డిలు సన్మానించారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డిపై తీవ్రస్థాయిలో ఎమ్మెల్యే సోమిరెడ్డి ఆరోపణలు చేశారు.

• **పొదలకూరు:** సర్వేపల్లి వ్యవసాయ మార్కెట్ కమిటీలో పొదలకూరుకు చెందిన వెంపులూరు అరుణ, అక్కెం సుధాకర్‌రెడ్డి, పోతుగుంట రామలింగయ్య నాయుడు, పిన్నెల్లి ప్రభాకర్‌కు చోటు దక్కింది.



రామకృష్ణారెడ్డిని అభినందిస్తున్న సోమిరెడ్డి